సాక్షి ఖమ్మం

శనివారం । 21 । జనవరి । 2023



కళ తప్పిన కార్యాలయాలు

జిల్లా కేంద్రంలోని కార్యాలయాన్నీ నూతన కలెక్టరేట్‌కు తరలించడంతో ఆయా భవనాలు కళ తప్పి కనిపిస్తున్నాయి. 8లో



గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 18°

వాతావరణం

శనివారం ఉదయం, సాయంత్రం చలి గాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ఖేలో ఇండియా సెంటర్‌లో ప్రవేశాలు

ఖమ్మం స్పోర్ట్స్: భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్) ఆధ్వర్యాన కొనసాగుతున్న ఖేలో ఇండియా రాష్ట్ర సెంటర్‌లో అర్హులకు ప్రవేశాలు కల్పించనున్నారు. 2023–2024లో ప్రవేశాలకు గాను ఈనెల 31, ఫిబ్రవరి 1వ తేదీన ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. హైదరాబాద్ జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆర్చరీ, అథ్లెటిక్స్, హాకీ, కబడ్డీ ఎంపికలు, సరూర్‌నగర్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయని అధికారులు వెల్లడించారు.

నేటి నుంచి టైప్ రైటింగ్ పరీక్షలు


ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు ఈనెల 21, 22, 29, 30వ తేదీల్లో జరగనున్నాయి. ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఈ పరీక్షలు ఉంటాయని టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు వీరభద్రరావు, తిలక్, శ్రీనివాసరావు, బాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు 21, 22వ తేదీల్లో జూనియర్, లోయర్, హయ్యర్, హైస్పీడ్ ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో పరీక్షలు, 29, 30వ తేదీల్లో షార్ట్‌హ్యాండ్ లోయర్, ఇంటర్ హయ్యర్ పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

గ్రూప్–1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్–1 మెయిన్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. ఉమ్మడి జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్, స్టడీ సర్టిఫికెట్లు, ప్రిలిమ్స్ హాల్‌టికెట్, నాలుగు ఫొటోలతో ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపిక చేసిన వంద మందికి ఈనెల 25వ తేదీ నుండి ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం 08742–227427, 95738 59598 నంబర్లను సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం

- ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు



రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి మరింత మెరుగైన సేవలందించేలా కృషి చేస్తానని ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు వెల్లడించారు. ఇటీవల విధుల్లో చేరిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతీ విభాగంలో ఆరోగ్య సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎంసీహెచ్‌లో ప్రసవాలు పెంచేలా దృష్టి సారించినట్లు తెలిపారు. ఆస్పత్రి లో ఓపీ వద్ద పురుషులు, స్త్రీలకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేయడమే కాక పరీక్షల రిపోర్టులు త్వరగా వచ్చేలా చూస్తున్నామని, ఆరోగ్య శ్రీ సేవలను మరింత విస్తృతం చేస్తామని వివరించారు. కాగా, మెడికల్ కళాశాల ఏర్పాటు పనులు ఈనెల 22 నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పాత కలెక్టరేట్ భవనం, ఆర్అండ్‌బీ భవనం, జిల్లా ఆస్పత్రిలోని భవనాలు కళాశాలకు అనువుగా ఉండగా ఆధునికీకరణపై దృష్టి సారించినట్లు చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నుండే మెడికల్ కళాశాలలో ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

న్యాయశాఖ ఉద్యోగుల క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరించిన జిల్లా జడ్జి, తదితరులు

ఖమ్మంలీగల్: న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు, అదనపు జిల్లా న్యాయమూర్తి దేవీరూథ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరగనున్న లోక్ అదాలత్‌లో అధికసంఖ్యలో కేసులు పరిష్కరించేలా న్యాయశాఖ ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నంచర్ల వెంకటేశ్వర్లుతో పాటు శ్రీనివాసరెడ్డి, నాజర్, రాధేశ్యాం, వల్లంకొండ శ్రీనివాస్, వెంకటరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



వల విసరాలి.. ఈత కొట్టాలి !

సభ్యత్వం ఉంటే ప్రయోజనాలు



జిల్లాలో 12వేల మంది వరకు కొత్తగా మత్స్యకార సంఘాల్లో సభ్యత్వాలు జారీ చేయనున్నాం. ఈ సభ్యత్వం ఉంటే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. వలలు, ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలే కాక చేపలు విక్రయించుకునే టెంట్లు వంటివి సబ్సిడీపై అందుతాయి. అలాగే, ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా అందుతుంది. – డి.ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

- అప్పుడే మత్స్యకారులకు సంఘాల్లో సభ్యత్వం
- నూతన సభ్యత్వాల నమోదుకు ప్రభుత్వ ఆదేశం
- జిల్లాలో కొత్తగా 12వేల మందికి అవకాశం
- నీటి వనరుల విస్తీర్ణం, నైపుణ్య పరీక్షల ఆధారంగా జారీ



మత్స్యకారులకు నైపుణ్య పరీక్ష నిర్వహిస్తున్న పరిశీలకులు

ఖమ్మంవ్యవసాయం: మత్స్యకార కుటుంబంలో జన్మించినప్పటికీ మత్స్యకారుడిగా గుర్తింపు పొందాలంటే సభ్యత్వం తప్పనిసరి. అలాగే, ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాలన్నా సభ్యత్వం ఉండాల్సిందే. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నూతన సభ్యత్వ నమోదుకు ఇటీవల అనుమతించగా, నాలుగు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. నీటి వనరులు పెరగటం, వర్షాలు సాధారణ స్థాయికి మించి కురుస్తుండటంతో జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉంటోంది. దీనికి తోడు ఏటా ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై చేపపిల్లలు వదులుతుండడంతో మత్స్య సంపద అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యాన అర్హులకు ఉపాధి కల్పించేందుకు గాను మత్స్య సహకార సంఘాల్లో అర్హులందరికీ సభ్యత్వాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రస్తుతం 15వేల మంది సభ్యులు

1964 నాటి చట్ట ప్రకారం 30 కులాలకు చెందిన వారు మత్స్యకారులుగా కొనసాగుతుండగా, ఇటీవల మరో మూడు కులాలను కూడా అర్హులుగా చేర్చారు. బెస్త, గూళ్ల, గంగపుత్రులు, బోయి, ముదిరాజ్, తెనుగు తదితర కులాలతో పాటు గిరిజనులను కూడా అర్హులుగా చేర్చిన నేపథ్యాన కొత్త సభ్యత్వాల జారీ ప్రక్రియ చేపడుతున్నారు. జిల్లాలో 1,129 జలాశయాలు ఉండగా, ప్రస్తుతం 193 మత్స్య సహకార సంఘాలు, 15,053 మంది సభ్యులు ఉన్నారు. ఇక కొత్త సభ్యత్వాల జారీలో శాశ్వత నీటి వనరులు ఉన్న జలాశయాల్లోని ఎకరం విస్తీర్ణంలో ఒక మత్స్యకారుడికి, వర్షాధారంతో ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు నీరు ఉండే జలాశయాల్లో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఒక మత్స్యకారుడికి అవకాశం కల్పిస్తారు. తద్వారా జిల్లాలో మరో 12 వేల మంది మత్స్యకారులకు నూతనంగా సభ్యత్వాలు లభించనున్నాయి.

పరీక్ష ఉత్తీర్ణులైతేనే...

స్థానిక నీటి వనరులను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు నైపుణ్య పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికే సభ్యత్వాలు ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. తొలుత దరఖాస్తులను పరిశీలించి సహకార సంఘాల అధ్యక్షులు మత్స్యశాఖ అధికారులకు జాబితా సమర్పించాల్సి ఉంటుంది. ఆ జాబితా ఆధారంగా నైపుణ్య పరీక్షలను నిర్వహిస్తారు. శాశ్వత నీటి వనరులు ఉన్న జలాశయాల పరిధిలోనైతే ఈత కొట్టడం రావడమే కాక విసురు, కచ్చు వలలే కాక తెప్ప నుంచి వల వేసే నైపుణ్యం కలిగి ఉండాలి. ఇక వర్షాధార జలాశయాల్లో సభ్యత్వం కోసం ఈత కొట్టడం, విసుర వల వేయటం, పొంద్రి వల లాగటం వంటి నైపుణ్యాలు ఉన్న వారిని అర్హులుగా గుర్తిస్తారు. ఇక పరీక్షల నిర్వహణకు జిల్లా మత్స్యశాఖ, సహకార శాఖ అధికారులే కాక పక్క జిల్లా మత్స్యశాఖ అధికారితో కమిటీలను ఏర్పాటుచేస్తారు. గిరిజన ప్రాంతాల్లో ఐటీడీఏ అధికారి ఆధ్వర్యాన పరీక్ష నిర్వహించి ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డు చేస్తారు. అనంతరం జాబితాను జిల్లా మత్స్యశాఖ అధికారి రాష్ట్ర కమిషనర్‌కు సమర్పించి అనుమతి వచ్చాక ఏప్రిల్‌లోగా అర్హులకు సభ్యత్వాలు జారీ చేస్తారు.

పీఎంఏజీవై గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు

నేలకొండపల్లి: ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం(పీఎంఏజీవై) కింద జిల్లాలో ఎంపిక చేసిన ఎనిమిది గ్రామపంచాయతీల్లో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఉత్సవ్ ధామ్ కమ్యూనిటీ హాళ్లు మంజూరయ్యాయి. నేలకొండపల్లి, వైరా, బోనకల్, ఎర్రుపాలెం, ముదిగొండ, తల్లాడ, ఖమ్మం రూరల్ మండలాల్లో ఎనిమిది పంచాయతీలను గత ఏడాది పీఎంఏజీవై కింద ఎంపికచేసి, రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. వీటితో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు, పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించారు. తిరిగి అదే పథకంలో మళ్లీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో జిల్లాలోని తూటికుంట (బోనకల్), దాచాపురం(వైరా), కోనాయిగూడెం(నేలకొండపల్లి), అంబేద్కర్‌నగర్(తల్లాడ), మల్లారం(ముదిగొండ), మద్దులపల్లి(ఖమ్మం రూరల్), గోసవీడు, పగిళ్లపాడు(ఎర్రుపాలెం) పంచాయతీలు ఉన్నాయి. ఆయా జీపీల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి దాదాపు 500 చదరపు మీటర్ల భూమి సేకరించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, ఫర్నీచర్ ఇతర సౌకర్యాల కల్పన బాధ్యత గ్రామపంచాయతీలే చూసుకునేలా తీర్మానాలు పంపించాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు.

వచ్చే నెల 11న లోక్ అదాలత్

ఖమ్మంలీగల్: వచ్చే నెల 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. జిల్లా కోర్టులో శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. కాలం, ఖర్చు కలిసి వచ్చే సులభ విధానమే లోక్ అదాలత్ అని, ఇక్కడ ఇచ్చే తీర్పుపై అప్పీల్ కూడా ఉండదని తెలిపారు. రాజీ మార్గం వల్ల కక్షలు, కార్పణ్యాలు తగ్గిపోతాయని చెప్పారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద కేసులు, చెక్కులు, ప్రాంసరీ నోటు కేసులను పరిష్కరించేందుకు వీలు ఉన్నందున కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి సూచించారు.

ముక్కోటి లెక్క తేలింది..

- రామయ్యకు వీఐపీ టికెట్లతో నష్టం
- ఇతర టికెట్లు, ప్రసాదాల విక్రయంతో రూ.58 లక్షల రాబడి
- మిగులు లడ్డూల ఊసెత్తని ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరిగిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా దర్శన టికెట్లు, ప్రసాదాల ఆదాయం లెక్క తేలింది. తెప్పోత్సవం, ముక్కోటి పర్వదినం రోజున రాబడి వివరాలను ఆలయ అధికారులు ప్రకటించారు. టికెట్ల విక్రయాల ద్వారా రూ.36 లక్షలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.22.30 లక్షల ఆదాయం సమకూరింది. రూ. 2వేల విలువైన వీఐపీ టికెట్లు 1400 విక్రయానికి ఉంచగా 1219, రూ.1000 విలువైన టికెట్లు 400కు 400, రూ.500 టికెట్లు 1330కు 1252, రూ. 250 టికెట్లు 650కి 546 అమ్ముడయ్యాయి. ఇక 100 గ్రాముల లడ్డూలు 75,982 అమ్మడం ద్వారా రూ. 18,99,550, 400 గ్రాముల లడ్డూలు 2,750 అమ్మగా రూ.2,75,000 వచ్చాయి. పులిహోర, చక్కెర పొంగలి, బెల్లం రవ్వ కేసరి విక్రయాల ద్వారా రూ.55,685 ఆదాయం సమకూరింది. ఉత్తర ద్వార దర్శనం రోజున టికెట్లు, నిత్యాన్నదాన పథకానికి విరాళాలు, ఇతరత్రా ద్వారా రూ.8 లక్షల ఆదాయం వచ్చింది.

వీఐపీ టికెట్లు, లడ్డూలతోనే నష్టం..

ముక్కోటి ఉత్సవాల సమయంలో టికెట్లు మిగలడంతో ఆలయ ఆదాయానికి ఈ ఏడాది సైతం గండి పడింది. జిల్లా ఉన్నతాధికారుల సూచన మేరకు ఆలయ అధికారులు ఈ ఏడాది ముందుగానే టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచడం సత్ఫలితాలు ఇచ్చింది. అయితే ఆన్‌లైన్, కౌంటర్‌ల ద్వారా మిగిలిన టికెట్ల కంటే రూ. 2వేల విలువైన వీఐపీ టికెట్లు అత్యధికంగా 181 మిగలగా రూ.3.62 లక్షల ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఈ టికెట్లు అత్యధికంగా వీవీఐపీల కోసం రెవెన్యూ అధికారుల స్వాధీనంలో ఉన్నాయని, అందువల్లే మిగిలాయని సమాచారం. వాటిని కూడా భక్తులకు అందుబాటులో ఉంచితే మరికొంత ఆదాయం ఆలయానికి వచ్చేది. ఇక లడ్డూలు మిగలడం వల్ల కూడా నష్టం వాటిల్లింది. ముక్కోటి వేడుకల్లో భక్తుల కోసం 1.50 లక్షల లడ్డూలను సిద్ధం చేయగా, 75 వేల లడ్డూలు మాత్రమే విక్రయించారు. బందోబస్తు, భక్తుల రద్దీ పేరుతో ఆలయానికి తూర్పు ముఖంగా ఉన్న లడ్డూ కౌంటర్లను పోలీసులు మూసివేయించడమే ఈ భారీ నష్టానికి కారణమని తెలుస్తోంది. మిగిలిన 75 వేల లడ్డూలు సైతం విక్రయించగలిగితే మరో రూ.20 లక్షల ఆదాయం రామయ్యకు అదనంగా సమకూరేది. అయితే, ఆదాయ వివరాలను వెల్లడించిన అధికారులు.. భక్తుల కోసం సిద్ధం చేసిన లడ్డూలలో ఎన్ని మిగిలాయి, వాటి ద్వారా ఎంత నష్టం అనే వివరాలను మాత్రం ప్రకటించలేదు. ఇటీవల బూజు పట్టిన లడ్డూలను విక్రయించారని భక్తులు ఆరోపించడం, భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నీలిమ ఫిర్యాదుతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం, తద్వారా శాంపిళ్లను పరీక్షలకు పంపడం, దేవాదాయ శాఖ త్రిసభ్య కమిటీ విచారణ జరపడం వంటి అంశాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు ప్రకటించే లడ్డూల తయారీ, మిగులు లెక్కలే కీలకంగా మారనున్నాయి.

రేపు ఏఈఈ పరీక్ష

- 19 కేంద్రాలు.. 6,664మంది అభ్యర్థులు
- అమలులో నిమిషం నిబంధన

ఖమ్మం సహకారనగర్: వివిధ ఇంజనీరింగ్ శాఖ ల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) పోస్టుల భర్తీకి టీఎస్పీఎస్సీ ఆధ్వర్యాన ఈనెల 22వ తేదీన జరగనున్న పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఖమ్మంలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేయగా, 6,664మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 10నుంచి 12–30గంటల వరకు జరిగే పరీక్ష కు అభ్యర్థులను 8–30నుంచి 9–45గంటలకు వరకే అనుమతిస్తారు. అలాగే, మధ్యాహ్నం పరీక్ష 2–30 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరగనుండగా, అభ్యర్థులు 1–30నుంచి 2–15గంటల వరకే అనుమతిస్తారు. ఇక నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లుగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, లైజనింగ్ అధికారులుగా తహసీల్దార్లు, అసిస్టెంట్ లైజనింగ్ అధికారులుగా డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు.

అటెస్టేషన్ తప్పనిసరి



పరీక్షకు దరఖాస్తు చేసుకున్న పలువురు అభ్యర్థుల హాల్ టిక్కెట్లపై ఫొటోల ముద్రణ జరగలేదని తెలు స్తోంది. వీరు మూడు పాస్ ఫొటోలు తీసుకుని గెజిటెడ్ అధికారి ధృవీకరణతో పరీక్ష కేంద్రానికి రావాలి. అలాగే, నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున నిర్ణీత సమయంలో కేంద్రాలకు చేరుకోవాలి. – ఎస్.మధుసూదన్, అదనపు కలెక్టర్

లాభాల పంట ఆయిల్‌పామ్

- సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య
- రేగళ్లపాడులో 2.50 లక్షల మొక్కల పంపిణీ



మొక్కలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, అసిస్టెంట్ కలెక్టర్ రాధికగుప్తా

సత్తుపల్లి: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. అయితే, తెలంగాణలో ఈ పంట విస్తీర్ణం పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్న నేపథ్యాన కేంద్రప్రభుత్వం కూడా సబ్సిడీలు ఇచ్చి మరింత దృష్టి సారించాలని ఎమ్మెల్యే అన్నారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు ఆయిల్‌పామ్ నర్సరీ వద్ద అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి 2.50 లక్షల పామాయిల్ మొక్కల పంపిణీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.లక్ష కోట్ల విలువైన పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నందున ఆయిల్‌పామ్ పంట సాగును తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఇదేమాదిరి కేంద్రప్రభుత్వం కూడా పామాయిల్ టన్నుకు రూ.20వేలు మద్దతు ధర, డ్రిప్ ఇరిగేషన్‌పై సబ్సిడీ ఇస్తే మరికొందరు రైతులు ముందుకొస్తారని చెప్పారు. కాగా, దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ ఎవరి జోక్యం లేకుండా ప్రాధాన్యతా క్రమంలో మొక్కలు అందజేస్తామని తెలిపారు. ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి అనసూర్య, ఆయిల్‌ఫెడ్ మేనేజర్ బాలకృష్ణ, స్పెషల్ ఆఫీసర్ ధన్‌రాజ్, ఎంపీపీ దొడ్డా హైమావతి, సర్పంచ్ వడ్డంగి విజయ, ఎంపీడీఓ సుభాషిణి, ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు బొడ్డు శివ, తుంబూరు శ్రీరాంప్రసాద్, ఎస్.కే.రఫీ, రమేష్‌రెడ్డి, బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దృష్టి లోపంతో ఎవరూ ఇబ్బంది పడొద్దు

- అందుకే రెండో విడత కంటివెలుగు
- శిబిరాలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్, డీఎంహెచ్ఓ

ఖమ్మం అర్బన్: దృష్టి లోపంతో ఏ ఒక్కరూ ఇబ్బంది పడొద్దనే భావనతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈమేరకు జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు ఇచ్చేలా ఉద్యోగులు కృషి చేయాలని ఆదేశించారు. ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి ఖమ్మం 12వ డివిజన్ పోలీస్ కాలనీ, 9వ డివిజన్ రోటరీనగర్‌లోని కంటి వెలుగు శిబిరాలను శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రిజిస్ట్రేషన్, పరీక్షలు, అద్దాల పంపిణీని పరిశీలించాక మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించి శిబిరాలకు వచ్చేలా చూడాలని తెలిపారు.

రోజుకు 150మందికి పరీక్షలు నిర్వహించాలి

ఖమ్మం సహకారనగర్: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రతీ శిబిరంలో రోజుకు 150 మందికి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. నూతన కలెక్టరేట్ నుంచి ఆయన ఎంపీడీఓలు, పీహెచ్‌సీల వైద్యాధికారులతో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిబిరాలకు తక్కువ మంది వస్తే విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఎంహెచ్ఓ బి.మాలతి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాంబాబు, ప్రాజెక్ట్ అధికారులు డాక్టర్ సైదులు, డాక్టర్ వెంకటనర్సయ్య, కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి, వైద్యాధికారులు రీతూ చౌదరి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మన బస్తీ – మన బడి పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు చేపట్టిన మన బస్తీ – మన బడి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ సూచించారు. నగరంలోని 9, 10వ డివిజన్లలో ఇందిరానగర్, రోటరీనగర్ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆయన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరానగర్ పాఠశాలలో రూ. 23.27 లక్షలతో, రోటరీనగర్ పాఠశాలలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, హెచ్‌ఎం ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభం నుంచి బయటపడేందుకే..

- విద్యుత్ సంస్థలకు అధిక నిధులు
- రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు



మాట్లాడుతున్న తన్నీరు శ్రీరంగారావు, పక్కన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన సౌకర్యాల కోసం రూ.38 వేల కోట్లు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు రూ.45వేల కోట్లు, సబ్సిడీలకు రూ.875 కోట్లు కేటాయించిందని చెప్పారు. చట్టం కల్పించిన హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడాలని కోరారు. 27 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచితంగా నిరంతర విద్యుత్ ఇస్తుండడంతో సాగు పెరిగిందని అన్నారు. జిల్లాలో విద్యుత్ సమస్యలపై తప్ప ఎవరూ అధికారులపై ఫిర్యాదు చేయలేదంటూ సిబ్బందిని అభినందించారు. వినియోగదారులకు ఏమైనా సమస్యలుంటే 1912, 18004 250028 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో మండలి సభ్యులు మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్య, సెక్రటరీ ఎం.నాగరాజు, జాయింట్ డైరెక్టర్ లక్ష్మణ్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, సీజీఎం మధుసూదన్‌రావు, అధికారులు కె.రమేష్, మురళి, టి.శేషాద్రి, కె.జీవన్ పాల్గొన్నారు.

మీలో నేను.. మీతోనే నేను !



ఇటీవల ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్)లోని ప్రతీ ఫ్లోర్‌కు భోజనశాల ఏర్పాటుచేశారు. ఉద్యోగులు మధ్యాహ్న భోజనం చేసేందుకు టేబుళ్లు, కుర్చీలు సమకూర్చారు. ఈమేరకు శుక్రవారం భోజన విరామ సమయం కాగానే చాంబర్‌లో వసతి ఉన్నప్పటికీ కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో కలిసి డైనింగ్ హాల్‌లోనే భోజనం చేశారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరాం, సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్‌తో కలిసి భోజనం చేయడాన్ని పలువురు ఉద్యోగులు కెమెరాల్లో బంధించారు. – ఖమ్మం సహకారనగర్

క్లుప్తంగా

క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి

ఖమ్మం సహకారనగర్: రానున్న పదిహేను రోజుల్లో ఓటరు జాబితాలోని పీఎస్ఈ ఎంట్రీల క్షేత్రస్థాయి పరిశీలన వంద శాతం పూర్తిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుండి శుక్రవారం ఆయన వీసీ ద్వారా పలు అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించడమే కాక 80ఏళ్ల పైబడిన వారితో పాటు కొత్త ఓటర్లను సన్మానించాలని సూచించారు. అలాగే, ఓటరు కార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానంపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో వంద శాతం ఆధార్ అనుసంధానానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరాం, కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమర్షియల్ ట్యాక్స్ డీసీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీసీ

ఖమ్మం సహకారనగర్: కమర్షియల్ ట్యాక్స్ శాఖ కార్యాలయ నిర్వహణకు ప్రభుత్వ భవనం కేటాయించాలని శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) బాలాజీనాయక్ కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను కోరారు. ఈమేరకు నూతన కలెక్టరేట్‌లో ఆయన కలిసి మాట్లాడారు. ప్రస్తుతం తమ కార్యాలయం అద్దెభవనంలో కొనసాగుతున్నందున, నూతన కలెక్టరేట్‌కు తరలించిన వ్యవసాయ శాఖ కార్యాలయ భవనాన్ని కేటాయించాలని కోరగా, కలెక్టర్ తక్షణమే కేటాయించారని బాలాజీనాయక్ తెలిపారు. ఈకార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు మజీద్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులతో ఉపయోగం


సాళ్లలో పరిశీలిస్తున్న జీఎం థాలే, తదితరులు

ఖమ్మంఅర్బన్: చిన్న తరహా వ్యాపారులకు చేయూతనిచ్చేలా పరిశ్రమల యజమానులు సహకరించాలని.. ఇందుకోసం వెండర్ డెవలప్‌మెంట్‌లపై అవగాహన సదస్సులను వినియోగించుకోవాలని మణుగూరులోని భారజల కర్మాగారం జీఎం వీ.కే.థాలే సూచించారు. ఖమ్మం డిగ్రీ కాలేజీ ఆవరణలో రెండు రోజుల పాటు జరగనున్న వెండర్ డెవలప్‌మెంట్ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సదస్సులో వివిధ కంపెనీలు, సంస్థల బాధ్యులు పాల్గొని వ్యాపార సంబంధాలను పెంచుకోవడమే కాక, వారికి అవసరమైన విక్రేతల వివరాలు తెలుసుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం అజయ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరామప్రసాద్‌తో పాటు రైస్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈమేరకు పలు స్టాళ్లను ఏర్పాటుచేయగా జీఎం తదితరులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

దేవుడి మాన్యంపై దళారుల కన్ను

ఖమ్మంఅర్బన్: నగరం నడిబొడ్డున ఉన్న రూ.కోట్ల విలువైన దేవుడు భూములపై దళారుల కన్ను పడింది. ఆ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించిన కొందరు ఆక్రమణకు యత్నించగా, ఆలయ కమిటీ సభ్యులు అడ్డుకుని కలెక్టర్, పోలీ సులకు ఫిర్యాదు చేశారు. 1966లో టీకులపల్లిలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయానికి దూపదీప నైవేద్యం, నిత్యాన్నదానానికి గాను రోటరీనగర్‌లో మూడెకరాల భూమిని దాతలు ఇచ్చారు. అందులోనే టీకులపల్లి ఆలయానికి అనుబంధంగా దేవాలయాన్ని నిర్మించి పూజలు చేస్తున్నారు. అయితే, అక్కడ భూమి విలువ గజానికి రూ.లక్ష వరకు పలుకుతుండడంతో కొందరు కబ్జాదారులు తప్పుడు పత్రాలతో గురువారం ఆక్రమణకు యత్నించారు. దీంతో అడ్డుకున్న కమిటీ సభ్యులు ఖమ్మం అర్బన్ పోలీ సులకు ఫిర్యాదు చేయడమే కాక, శుక్రవారం సీపీ, కలెక్టర్‌ను వినతిపత్రాలు అందజేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	---	---
మిర్చి కొత్తవి	19,800	13,500
నిల్వ మిర్చి	19,000	17,000
తాలు మిర్చి	10,000	7,500
పత్తి	8,100	5,700

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

కళ తప్పిన కార్యాలయాలు

- నూతన కలెక్టరేట్‌కు తరలిన ఆఫీసులు
- సమాచారం తెలియక వచ్చివెళ్తున్న లబ్ధిదారులు
- కొత్త కార్యాలయాల్లో ఇంకా కుదురుకోని పలు శాఖలు


అత్యవసర పనుల కోసం ల్యాప్‌ట్యాప్‌ను వినియోగిస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం వైద్యవిభాగం/ఖమ్మం వ్యవసాయం: కొత్త కలెక్టరేట్‌ను ప్రారంభించిన మరుసటి రోజైన గురువారం నుంచే దాదాపు అన్ని శాఖల కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇప్పటికే సామగ్రిని తరలించేసిన వివిధ ఉద్యోగులు ఇంకా మిగిలిన సామగ్రిని కొత్త ఆఫీసుకు చేరవేయడంలో నిమగ్నమయ్యారు. ఫలితంగా ఇంతకాలం రాకపోకలు, వాహనాల రద్దీతో హడావుడి కనిపించిన కార్యాలయాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఇదేక్రమంలో పాత కార్యాలయాల వద్ద ఎలాంటి సమాచార బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో ఇంకా వివిధ పనులపై కొందరు వచ్చివెళ్తున్నారు. ఈక్రమంలోనే సంక్షేమ భవన్‌కు పింఛన్ కోసం మూడు చక్రాల సైకిల్‌పై వచ్చిన ఖానాపురం హవేలీకి చెందిన దివ్యాంగుడు బచ్చు వేణుమాధవ్ అక్కడ ఎవరూ లేకపోవడంతో విస్తుపోయాడు. కార్యాలయాన్ని నూతన కలెక్టరేట్‌కు మార్చినట్లు అటెండర్లు చెప్పడంతో మళ్లీ అక్కడకు మూడు చక్రాల సైకిల్‌పై ఎలా వెళ్లాలని నిరాశగా వెనుతిరిగాడు. అలాగే, కొత్త కలెక్టరేట్‌లో గదులు కేటాయించినా కొన్ని శాఖలకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి రాలేదు. దీంతో స్కాలర్‌షిప్‌లు, హరితహారం, బ్యాంక్ లింకేజీ రుణాల అప్‌డేటేషన్ తదితర పనుల కోసం సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులైతే డీఆర్‌డీఏ సిబ్బంది ఖమ్మంలోని టీటీడీసీ భవనానికి వస్తుండగా, మరికొందరు ల్యాప్‌ట్యాప్‌ల్లో ఫోన్ డేటాతో పనులు చక్కబెడుతుండడం కనిపించింది.


ఖాళీ చేయగా వెలవెలబోతున్న డీఎంహెచ్‌ఓ కార్యాలయం


డీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగుడు వేణుమాధవ్


తాళం వేసి ఉన్న జిల్లా మత్స్యశాఖ కార్యాలయం

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..
ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..
ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...
ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.
జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..
ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 96660 13544
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

‘కంటి వెలుగు’ శిబిరాల పరిశీలన


చింతకాని : శిబిరంలో పరిశీలిస్తున్న స్నేహలత


ఖమ్మం రూరల్ : పత్రాలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి

చింతకాని: మండలంలోని వందనంలో కంటివెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ స్నేహలత శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణ, అద్దాల పంపిణీని పరిశీలించిన ఆమె శిబిరాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ రవీంద్రప్రసాద్, సర్పంచ్ కొరిపల్లి సునీత, వైద్యాధికారి షఫీక్ పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్ మండలంలో..
ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెం, పోలేపల్లిలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శిబిరాలకు వచ్చేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, పరీక్షలు నిర్వహించాక దృష్టి లోపం ఉన్న వారికి అవసరమైన కంటి అద్దాలు ఇవ్వాలని తెలిపారు. వైద్యులు శ్రీదేవి, దీప్తి, హెచ్ఈఓ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే..

ఖమ్మంలీగల్: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులను చూసుకోవడం బిడ్డల బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా అన్నారు. పాలేరుకు చెందిన వృద్ధ దంపతులను నిరాదరణకు గురిచేసిన కేసులో న్యాయమూర్తి శుక్రవారం ఇరుపక్షాల వారిని న్యాయసేవాసదన్‌కు పిలిపించారు. ప్రాథమిక కౌన్సెలింగ్ పూర్తయ్యాక కూడా వృద్ధ దంపతులు వెంకన్న – మల్లమ్మను ఆదరించడానికి కుమారులు అంగీకరించకపోవడంతో తదుపరి కౌన్సెలింగ్‌ను సాయంత్రానికి వాయిదా వేశారు. ఈ లోగా న్యాయమూర్తి న్యాయసేవాసదన్ బయటకు రాగా వృద్ధ మహిళ తన గోడు వెళ్లబోసుకుంది. ఈమేరకు ఇమె ఇరువురి కుమారులను పిలిపించిన న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లి దండ్రులు, వృద్ధుల రక్షణ చట్టం ప్రకారం తల్లి దండ్రులను నిరాదరణకు గురి చేస్తే ఆస్తి వారికే తిరిగి ఇవ్వొచ్చని తెలిపారు. దీంతో కుమారులు తమ తల్లిదండ్రులు మంచిగా చూసుకుంటామని హామీ ఇచ్చి తీసుకెళ్లారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్ సూచించారు. నూతన కలెక్టరేట్‌లో శుక్రవారం వారు జిల్లా అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, అభివృద్ధి, సంక్షేమ ప్రగతిపై నివేదిక సమర్పించాలని తెలిపారు. అలాగే, వివిధ శాఖలు ఆధ్వర్యాన స్టాళ్లు, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. అంతేకాకుండా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించేందుకు గాను ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఈసమావేశంలో డీఆర్వో శిరీష, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఎమ్మెల్సీ కుటుంబానికి పలువురి పరామర్శ


ఎమ్మెల్సీ మధు, కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందాల

తిరుమలాయపాలెం: బెంగళూరులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సోదరుడు విశ్వేశ్వరరావు కుమారుడు నిఖిల్ మృతి చెందగా స్వగ్రామమైన పిండిప్రోలులో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. నిఖిల్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం పిండిప్రోలుకి తీసుకురాగా, ఆయన కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆయన మరణంతో తల్లిదండ్రులు విశ్వేశ్వరరావు – నాగమణి రోదిస్తుండగా ఆపడం ఎవరి తరం కాలేదు. కాగా, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, హరిప్రియ, రాములు నాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, చంద్రావతి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పోటు ప్రసాద్, బాగం హేమంతరావు మంగీలాల్, బెల్లం ఉమ, చావా శివరామకృష్ణ, చావా వేణు, రాయల నాగేశ్వరరావు తదితరులు నిఖిల్ మృతదేహం వద్ద నివాళులర్పించి ఎమ్మెల్సీ కుటుంబాన్ని పరామర్శించారు.

వలస ఆదివాసీ గ్రామాల్లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృందం

చర్ల: మండలంలోని వలస ఆదివాసీ గ్రామాలను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బృందం శుక్రవారం సందర్శించింది. కమిషన్ అధికారి మదన్‌గోపాల్ నేతృత్వాన సభ్యులు మండలంలోని కందిపాడు, క్రాంతిపురం గ్రామాల్లో పర్యటించి వలస ఆదివాసీల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడికి రావడానికి కారణాలు, ఇక్కడ జీవన విధానం, సమస్యలపై ఆరా తీశా రు. ఈ సందర్భంగా వలస ఆదివాసీలు తమకు పోడు భూముల హక్కుపత్రాలు ఇవ్వడం లేదని, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదనే సమస్యలను విన్నవించారు. బృందం వెంట సీసీఎఫ్ భీమ్లానాయక్, డీఎఫ్ఓ బాబు, తహసీల్దార్ బి.భరణిబాబు, ఎఫ్ఆర్ఓ ఉపేందర్, ఆర్ఐ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

‘తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు..’

ఖమ్మం మామిళ్లగూడెం: సీఎం కేసీఆర్ హామీలను తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి కడగంచి రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ సభలో ఇచ్చిన ఏ హామీ కూడా నెరవేరుతుందనే నమ్మకం ప్రజలకు లేదన్నారు. ఇక త్రిపుర, బెంగాల్‌లో ప్రజలచే తిరస్కరించబడిన కమ్యూనిస్టులు ఇప్పుడే బీఆర్ఎస్ పంచన చేరి తమను ఓడిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నున్నా రవికుమార్, శ్యాంరాథోడ్, అల్లిక అంజయ్య, ఉపేందర్ గౌడ్, దీకొండ శ్యాం, చావా రవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు

తిరుమలాయపాలెం: పురుగుల మందు తాగిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని బచ్చోడుకు చెందిన అంగిరేకుల యాదగిరి కుమారుడు గణేష్(24) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఆయన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అయితే, తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని గణేష్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, గణేష్ ఐదు నెలల క్రితం ఓ యువతిని ప్రేమించి మోసం చేశాడని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, కొందరు పెద్దమనుషులు న్యాయం చేస్తామని చెప్పి డబ్బు తీసుకున్నట్లు సమాచారం. దీంతో యువతి మళ్లీ పోలీసులను ఆశ్రయించగా పెద్దమనుషులతో పాటు గణేష్, ఆయన తండ్రిపై కేసు నమోదైంది. ప్రస్తుతం కేసు విచారణకు రానుండడంతో డబ్బు ఇచ్చి కేసు సెటిల్ చేసుకోవాలని గణేష్‌పై పెద్దమనుషులు ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అయితే, ఈ పరిహారం రూ.లక్షల్లో ఉండడంతో గణేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్నారు.


గణేష్ (ఫైల్)

దేవతల గుట్టపై క్వారీ సర్వే


సర్వే చేస్తున్న ఉద్యోగులు

పెనుబల్లి: మండలంలోని లింగగూడెం 302 సర్వే నంబర్‌లోని దేవతలగుట్ట క్వారీ భూమిని మండల సర్వేయర్ ఈశ్వరి ఆధ్వర్యాన శుక్రవారం సర్వే చేశారు. పోపూరి కన్‌స్ట్రక్షన్స్ పేరుతో తాత్కాలిక లైసెన్స్ తీసుకుని క్వారీ(స్టోన్ క్రషర్) నడుపుతున్నారని, లీజ్‌కు తీసుకున్న భూమికంటే ఎక్కువ మొత్తంలో గిరిజనుల పేరిట స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుతో ఈనెల 12న తహసీల్దార్ రమాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతికి మించి భూమిలో క్వారీ నడుపుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈమేరకు శుక్రవారం సర్వేయర్ ఆధ్వర్యాన పరిశీలించగా త్వరలోనే కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని తహసీల్దార్ తెలిపారు.

బ్రేక్ బదులు ఎక్సలేటర్ తొక్కాడు!

కారు పూజ కోసం రాగా బీభత్సం


ప్రమాదానికి కారణమైన కారు

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ దర్గా వద్ద కొత్త కారు బీభత్సం సృష్టించింది. ఖమ్మం జిల్లాకు చెందిన రఫీ ఇటీవల కొత్త కారు కొనగా పూజ చేయించేందుకు శుక్రవారం దర్గాకు వచ్చాడు. ఈక్రమంలో దర్గా సమీపాన కారు నడుపుతున్న ఆయన భక్తులను తప్పించే క్రమంలో బ్రేక్‌కు బదులు ఎక్స్‌లేటర్ తొక్కాడు. దీంతో కారు మరింత వేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న బుచ్చన్న, నందిని, చింటు, దస్రు, మాలతిని ఢీకొట్టగా వీరికి గాయాలయ్యాయి. అలాగే, పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై దేవేందర్, సిబ్బంది చేరుకుని క్షతగాత్రులను మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఆస్పత్రికి తరలించారు. అలాగే, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో నాగమ్మగుడి ఎదురుగా శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ మృతి చెందాడు. ఏపీలోని వత్సవాయి మండలం మక్కపేటకు చెందిన గుగులోతు అజయ్‌కుమార్(25) మండలంలోని పువ్వాడ నగర్‌తో తన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వస్తున్నాడు. ఈక్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ఆయన తల్లి యశోద ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రవి తెలిపారు.

వైకుంఠధామంలో శివుడి విగ్రహం ధ్వంసం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం వైకుంఠధామంలో ప్రతిష్టాపనకు తీసుకొచ్చిన శివుడి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మోటాపురంలో నిర్మించిన వైకుంఠధామంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి చావా కృష్ణమూర్తి శివుడి విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించారు. ఈమేరకు గురువారం రాత్రి 11 గంటలకు విగ్రహాన్ని తీసుకురాగా, ఈనెల 23న ప్రతిష్టాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, శుక్రవారం తెల్లవారుజామున విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కాగా, వైకుంఠధామం నిర్మించిన స్థలం విషయమై కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈమేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.